# తీరని కోరిక

రచన :
శ్రీ మండా రామారావు.

చేతివాచీ చూసుకునేసరికి పదకొండు దాటిపోయింది.

మరో గంటసేపు ఆలోచిస్తే ఎలాగైనా కథ ముగింపవుతుందని దగ్గర్లోవున్న ఫ్లాస్కు తెరచాడు, అనుకోకుండా కళ్యాణి ఆగమనాన్ని గమనించి కప్పులో పోయవలసిన కాఫీ చేతిమీద వంపుకున్నాడు.

చురుక్కుమనగానే చేయి విదలించుకున్నాడు.

'ఏం బావా? అంత పరాకు చిత్తగిస్తే కొంప లంటుకుంటాయ్' రెండు కప్పులూ నింపి అతనికో కప్పు అందించి తనో కప్పు తీసుకుని ఎదురుకుర్చీలో కూర్చుంది, కూర్చున్నదే తడవు బల్లమీది కాగితాల దస్తరం ఆమెను యిట్టే ఆకర్షించింది.

'ఏమిటిదంతా? పరీక్షలకు గాని కూర్చోలేదుగదా!' అని కాగితాలు చూడసాగింది. చూస్తున్న కొద్దీ విస్మయపడసాగింది.

'ఏది...ఇటివ్వూ' బలవంతంగా లాక్కోబోయాడు రామం.

'ఉండు బావా! కథలు రాయడం నేర్చుకున్నావన్న మాట. అయితే మా కన్యాలోకం జాగ్రత్తపడాలి గాబోలు!'

వరుసగా నేర్పబడివున్న కాగితాలు చదువ మొదలిడింది.

'కల్యాణం వచ్చినా కక్కువచ్చినా ఆగవు' చదివి 'భేష్ బావా! భేష్...బాగానే వుంది ప్రారంభం. ఇంత వచ్చని తెలిస్తే రోజూవచ్చి శిష్యరికం చేద్దునే' మనసులోనే నవ్వుకుని తిరిగీ చదువసాగింది.

'ఉద్యోగమైంది గదాని కళ్యాణం చేసుకుందుకు సిద్ధపడ్డాడు. మూడుసార్లు తలిదండ్రులు గమ్మంటే పెళ్ళి చూపులకని వెళ్ళాడు.

మొదటి సంబంధం అమ్మాయి రూపవతి. కాని కొంచం మెల్ల. అంతటి తెల్లని చల్లని చంద్రునికే మచ్చవుంది. అంతగా పొగడబడుతున్నాడు గదా! అన్నీవుండి మెల్లకన్ను వుంటే ఏం పోయిందని తనను తాను సమర్ధించుకున్న తోటిమిత్రులు గేలిచేస్తారనిమానుకున్నాడు.

ఇక రెండో అమ్మాయి గుణవంతురాలు. డబ్బులేకపోయినా కష్టపడి సంపాదించవచ్చు; అందం కొరుక్కుతినం; కాని గుణం లోపించినట్లయితే నరకయాతనలనుభవించాల్సి వస్తుందని తెల్సినా ఆ పిల్లను చేసుకుంటే నల్గురిలో సరదాగా తిరగలేక తోటివారి చిన్నచూపుకు గురికావలసి వస్తుందని మానుకున్నాడు. ఇక మూడో సంబంధం అన్నివిధాలా మంచిదే అని చూడగానే తలచి చేసుకోవాలని ఉరకలు వేసాడు. నెమ్మదిగా చూపులు వదలాడో లేవో 'కట్నం దమ్మిడీ అయినా మేం యిచ్చుకోలేం... చేసుకుంటూరా?' సూటిగా యదార్ధం చెప్పివేసింది. పాపం! ఆ పిల్ల ఎంతమంది యువకులిలా వచ్చి చూచి మోసం చేయగా బాధపడిందోనని మనసులో సానుభూతి చూపుకున్నాడు. ఆమె వాలకం చూసాక తల్లిదండ్రులు లాభం లేదని ముఖమాటమయినా లేక చెప్పివేయడంవల్ల తిరుగుముఖం పట్టవలసి వచ్చింది. నాల్గవ సంబంధం ప్రయత్నిస్తే ఫలించవచ్చు.

ఆపిల్ల తన చిన్ననాటి నేస్తమేకాక రెండు సంవత్సరాల క్రితంవరకూ కలిసి మెలసి చదువుకున్నది.

ఒకరి నొకరు అర్ధం చేసుకున్నవారు.

కాని...?

ఆ రెండు కుటుంబాల అంతస్థులూ వేరైపోయాయ్.

పెద్దల అనంగీకారం మాత్రమే యిద్దరి కలయికకీ ముఖ్యమైన ప్రతిబంధకం.

పెద్దలను ఎదిరించి ఏదైనా చేస్తే వచ్చే కష్టనిష్టూరాలు తెల్సని ఆ యువకుడు ముందు వెనుక లాడసాగాడు.

ఆ యిద్దరూ చదువులు వెలిగించినా, ఒకరి నొకరు ప్రేమించుకొన్నా మనసులోని మాట బయల్పరచలేక బాధపడసాగారు.

తరచు వారిద్దరూ కలుసుకుంటున్నా ఒకరిని మించిన వారింకొకరన్నట్టు బుంగమూతులు పెట్టుకుని కూర్చుంటారు.

అలా ఎదురెదురుగా ఎంతసేపు కూర్చున్నా, విసుగు చూపరు సరికదా, ఇంకాస్సేపు కూర్చోవాలని ఉత్సుకత చూపుతారు.

'తప్పక ఆయిద్దరూ ఏకమౌతారన్న ఆశలో నిరీక్షణ

'అబ్బా...ఎంతబావుంది బావా! నల్గురమ్మాయిలనూ బాగా చిత్రించావ్'

అన్నదేగాని కళ్యాణి మనసులో రైళ్లు పరిగిడుతున్నాయ్, తోటి యువతులను అంతచులకన చేసినందుకుగాను.

'నన్ను చంపక వేగంయిస్తే భోంచేయాలి' బ్రతిమాలే ధోరణిలో అన్నాడు.

'ఆకలేస్తూందా! పాపం!! నల్గురు యువతులను సృష్టించి ఆనందం అనుభవించిన నువ్వు పంచభక్ష్య పరమాన్నాలు సృష్టించుకుని ఆరగించి ఆకలి తీర్చుకోలేవూ?' సమయం వచ్చిందని తన కసినంతా వెళ్ళగ్రక్కింది.

'శతమొండిగా తయారవక వేగం లెద్దూ తర్వాత విమర్శించుకుందాం'

అన్నాడేగాని మళ్ళీ ఏంకొంప ముంచే మాటలు విసురుతుందోనని మనసులో గుబగుబలు.

'విసుక్కోవయ్ బావా! ఈకొద్దీపూర్తిచేసి పోతాలె' అని మిగిలింది చదివింది.

'ఇంతకీ అతనికి కళ్యాణ యోగం వుందా? ఎంతకాలమని యింకా ఆగాలి? తను ఆశించే సంబంధం కుదురుతుందా?'

కళ్యాణి వచ్చినది వచ్చినట్టుండక సంక్షిప్తంగా వ్రాసుకున్నది కాస్తపగలబడి నవ్వసాగింది.

అంతవరకూ వున్న తొందరమాని నవ్వే కళ్యాణిని దీక్షగా పరిశీలించసాగాడు.

రహస్యంగా రాసుకున్నది చదివింది.

చదివి తన నెగతాళి చేస్తున్నట్టు నవ్వుతూంది.

ఆ నవ్వే తనను పరవసింప చేస్తూంది.

అంతవరకూ వ్రాసినందువల్ల కల్గినశ్రమ, దహించివేసే ఆకలి ఆ నవ్వు మూలంగానే మటుమాయమయాయి.

'ఏం బావా! పూర్తిచేసి వివరించి ఏ పత్రికకైనా పంపితే బహుమతి వచ్చేదిగా' ఇంకేమైనా వ్రాసేదేమో నన్న అనుమానంతో మిగతా కాగితాలు చూస్తూ అంది.

'పంపాలనే వుంది. కాని కలం సాగొద్దూ!'

'సాగకపోవడమేమిటి బావా!' కొద్దిసేపాలోచించి 'పోనీనే పూర్తిచేయనా' నవ్వాపుకోలేక అంది.

కళ్యాణి మాటలకు కొంత దెబ్బతిన్న వెంటనే తేరుకుని 'కళ్యాణి కూడా కథలు వ్రాయగలదా?' మనసులోనే అనుకున్నా నమ్మకం కుదుర్చుకోలేకపోయాడు.

కళ్యాణి తనకు చిన్నతనంనుంచీ పరిచితురాలే.

ఇరువురూ ఒకేచోట చదువు సాగించినవారే.

తనలాగే యింకా కళ్యాణికి కళ్యాణ యోగం రాలేదు.

ఇద్దరూ చదువు చాలించిన ఫలితంగా ఆమె యింట్లోనూ, తను ఆఫీసులోనూ పడ్డారు.

ఇప్పుడీ కళ్యాణిని చూస్తున్నకొద్దీ కోరిక లూరసాగాయి.

కళ్యాణి తన కోరిక తీరుస్తుందా! అనుమానం.

అనుమానంలోనే అమాంతం కౌగలించుకోవాలన్న ఆకాంక్ష.

ఆకాంక్షలోనే ఏమౌతుందోనన్న నీతిమీది మమకారం.

ఆ మమకారంతోనే దీర్ఘమైన దీనమైన చూపు.

ఆ చూపులోనే తన్మయత్వం.

'బావా! అలా చూస్తూంటే దృష్టి తగుల్తుందేమో!'

రామం చూపు మళ్ళించబోయినా ఫలితం శూన్యం.

'కళ్యాణీ! నాలో కోర్కెలు రేపుతున్నావ్ నువ్వు'

'నిజంగా!' సంతోషమో, ఎగతాళో తెలియదు.

'నన్నెందుకలా ఆటలాడిస్తున్నావో అయోమయంగా వుంది.'

'నేనా! బావుంది బావా! నామీదే తప్పంతా తోసేస్తున్నావే!'

'లేదు...లేదు...కళ్యాణీ! నేను నిన్నర్థంచేసుకున్నా నువ్వుమాత్రం నన్నర్థంచేసుకోలేకపోతున్నావ్'

'అర్థంచేసుకున్నాను బావా! నీ సాహచర్యంలో ఎంతో నేర్చుకున్నాను కూడా.'

'నిజంగా నువ్వన్నట్లయితే ఈసరికి యిద్దరమూ ఏకమయేవాళ్ళం.'

'పో బావా... నీకెప్పుడూ ఇలాంటి కబుర్లే'

సిగ్గుతో ముఖం ఎర్రనవగా కంఠం రుద్ధమై ఇంకా అందంగా కన్పించింది.

'నీ చిలిపితనమంతా ఎక్కడికి పోయిందిప్పుడు? చూసుకో...ఇప్పుడెంత సొసుగా వున్నావో'

దగ్గర్లోనే వున్న అద్దం అందుకుని ఆమె ముఖానికి అతని ముఖం జతచేసి చూపాడు.

చూడ సిగ్గయింది.

బావమీద కోరిక మరెంతో హెచ్చింది.

మనసులోనిమాట చెప్పాలనుకున్నా సిగ్గు దొంతర్లు ముంచగా లేచి' బావా!

'నేనీకథపూర్తిచేసి పంపుతాను నాకేం బహుమానం యిస్తావ్' అన్నది.

'నేను బీదవాడినే... నేనేం బహుమతీయగలనని!' ఎత్తిపొడుపులోనే తృప్తి.

'నేనడగబోయేది బీద—భాగ్యాలకు సంబంధించినది కాదులే'

'అయితే చెప్పుమరి' తొందరపెట్టసాగాడు.

'చెప్పనా?' మురిపింపులోనే సంతోషం.

'చెప్పు కళ్యాణీ! నీకోసం ఏది యిమ్మన్నా యిస్తాను'

'చెప్తా...త్వరలోనే చెప్తా...నీమాట తప్పవుకదా!'

'ఎప్పుడూ తప్పను.'

'వస్తామరి'

కళ్యాణి నిష్క్రమించింది.

తనలో ఏవేవో మధురభావాలు రేకెత్తించి అనుమానం ముంచి మరీ వెళ్ళిపోయింది.

మళ్ళీ దర్శనం యెప్పుడో!

ఏవేవో లోకాల్లో విహరిస్తూన్న రామం భోజనం తెచ్చిన పనిమనిషి మూలంగా ఈలోకంలో పడ్డాడు.

తనకెందుకిప్పుడు భోజనం?

తన కళ్యాణి వచ్చి షడ్రసోపేతంగా భోజనం పెట్టి పొట్టనింపి వెళ్ళిందిగా!

తను కళ్యాణిని వుండమనకపోయినందుకు విచారించాడు.

* * *

ఆ రాత్రే కళ్యాణి కథ పూర్తిచేసింది.

ఉదయాన్నే రామంగది చేరుకుని 'సమయం వచ్చింది బావా!' అన్నది.

'ఏమిటా సమయం!'

'ఇస్తానన్నది మరచిపోయావా?'

'అంటే కథ పూర్తిచేసి తెచ్చావన్నమాట'

'నువ్వు మొదలుపెట్టగా లేనిది నేను పూర్తిచేయలేనా!!'

'ఏదీ! ఇటివ్వూ!'

'ఎక్కడుందని? పంపించేసాను'

'ఆ!!! నిజంగానే!!!' ఆశ్చర్యంలో నోరప్పళించాడు.

'ఏం? తప్పుపని చేసానా?' నొచ్చుకుంటూ అన్నది.

'ఛీ!! ఛీ!! అంతమాట అనగలనా నేను'

'మరెందుకలా ఆశ్చర్యపోయావు? బహుమతి ఈయవలసి వస్తుందనో.'

'అందుకకాదు కళ్యాణీ! నువ్వలా పూర్తిచేసి పంపావా అని'

'ఏం! నీ మనసు నాకెలా అర్థమైందో అలాగే కథాంతంకూడా చేసాను!'

'అంటే!!'

'నా నోటివెంట ఎందుకు అనిపిస్తావ్ బావా! నీబాధ నాకెప్పుడో తెల్సు! తప్పకుండా నీ కోరిక నెరవేరుతుంది'

'నిజమేనా కళ్యాణీ!'

'అవును బావా! కథ అచ్చయిన స్తే మన కోరికలు ఈడేరుతాయి'

'కథకు పేరేం పెట్టావింతకూ!'

'నువ్వే విషయం మీద ఆధారం పెట్టుకు వ్రాసావో దాని పేరే పెట్టాను.'

'నన్ను అనుమానంలో ముంచేసావే!'

'అన్నీ కొద్ది కాలంలో తీరిపోతాయిగా! మళ్ళీ వెళ్ళొస్తా.'

అమితోత్సాహంతో కళ్యాణి ఇంటికి వెళ్ళిపోయింది.

రోజులూ, వారాలూ గడిచిపోయాయ్.

మూడువారాలు గడిచినా కథ అచ్చవలేదు సరికదా చేరినట్టుగాని ప్రచురించే అర్హత వుందనికాని ఏ జాబూ రాలేదు.

ఆ యువతీయువకుల మనసులు విచారించాయ్.

కళ్యాణీ వివాహ విషయం గురించే తల్లిదండ్రులు రాద్ధాంత సిద్ధాంతాలు జరుపుకోసాగారీసమయంలోనే.

ఏ సంబంధం గురించి చెప్పినా కళ్యాణి ముఖావంగా వూరుకునేది. రామం గదికి కళ్యాణి రాకపోకలు సాగిస్తున్నా, రామం దూరపు బంధువైఅయినా అంతగా పట్టించుకోలేదింతవరకూ.

సమయం కలసివచ్చింది.

కథ అచ్చయి అనుకోకుండా పత్రిక రావడం రామాన్ని, కళ్యాణినీ ఆనంద సాగరంలో ముంచేసింది.

అంతేకాదు అప్పుడే అందుకున్న తమ్ముడు తిన్నగా తీసుకుపోయి తలిదండ్రులకు విన్పించడం కూడా జరిగిపోయింది.

మొదట్లో కళ్యాణి వ్రాసిందని నమ్మలేకపోయినా ఆమె ప్రవర్తనను బట్టీ, మార్పులనుబట్టీ ఆమె భావాలను ప్రతిబింబించే ఆ కథను ఆమే వ్రాసిందని నిర్ధారించుకున్నారు.

కథలోని పరమార్థం అవగతమయినా అలా ఆచరించడానికి వెనుకాడసాగారా పెద్దలు.

కళ్యాణి పూర్తిచేసిన కథ సారాంశం యిది:

'ఆ యువకుని నిరీక్షణ జీవం పోసుకుంది.'

మూడు పెళ్ళిచూపుల ఫలితంగా తన చిన్ననాటిచెలి పొందు లభించింది. అందుకు కారణం అతని కెంత విలువ లేకపోతే అన్ని సంబంధ లెలావస్తాయని భావించడమే.

ఆ జంట ఒకరినొకరు అర్థం చేసుకున్నారు కాబట్టే అంత సన్నిహితులు కాగలిగారనీ, తాహతు సరిపోనంత మాత్రాన ఆ యిద్దరిఆశలు నిరాశలు చేయకూడదనీ పెద్దలు నిర్ణయించుకున్నారు.

ఆ నిశ్చయంలోనే కూతురి మనోభిప్రాయం గ్రహించి తాంబూలాలు పుచ్చుకున్నారు.

ఆ ప్రేమికుల కలలు ఫలించాయి.

కళ్యాణయోగం వచ్చింది కాబట్టి చెట్టపట్టాలు పట్టి గృహస్థాశ్రమం స్వీకరించారు.

'నాన్నగారూ! ఎలాగూ పెళ్లిచేయాలని చూస్తున్నారు కాబట్టి నామనసులోని మాట కొంచం వినండి... నేనూ రామంబావా ఒకరి నొకరం అర్థంచేసుకున్నాం. ఏ పొరపొచ్చాలూ రాకుండా సదురుకుపోయే ఐక్యత సంపాదించుకున్నాం కూడా! అందుకే యీకథ అచ్చయింది. ఇందులో స్వాభావికత ఎంతో వుందనే ప్రచురించారు. నేనే యీకథను రాయలేదు. బావ నాకోసంపడే బాధతో మొదలు పెట్టగా, బావమీద ప్రేమతో యీకథ నేను పూర్తిచేసి పంపాను. బావ నాకు బహుమతిగా ఏది కావల్సివస్తే అదేయిస్తానన్నాడు. నాకోసం, నాసుఖం కోసం బావతో వెళ్ళి చెప్పండి... ఇంతవరకూ బంధువులమైనా అంతస్థులు పట్టుకు వ్రేళ్ళాడి బావను ఎంతగానో నొప్పించాం. నాన్నగారూ......' ఏదో చెప్పబోయి ఆగిపోయింది.

'మరి చెప్పనవసరం లేదమ్మా! అలాగే చేస్తాం... నీకోరిక తీర్చడమేగా మాకర్తవ్యం. ఈకథ వ్రాసైనా మాకళ్ళు తెరిపించారు మీరు. నిజంగా రామం నీకు తగినవాడే నమ్మా! ఇదిగో యిప్పుడే వెళ్ళి అన్నీ ఖాయపర్చుకు వస్తాను.' భార్యతో కూడా మనసులోని మాట చెప్పి ప్రయాణ మయాడు వెంటనే.

ముహూర్త నిర్ణయం జరిగిపోయింది తాంబూలాలు పుచ్చుకోగానే, ఎటుదెటు వస్తుందోనని దగ్గర్లో పెట్టించిన ముహూర్తంరానే వచ్చింది. విడదీయరాని మంగళసూత్రధారణ జరిగిపోయింది.

'కళ్యాణీ! ఈ మనకలయిక కథచేసిన ఫలితమేగా!' నాటిరాత్రిఅన్నాడు ముద్దుగా.

'...............'

ఒక్కసారిగా అతని నోటికి గలగలలాడే మృదుల హస్తం అడ్డుపడింది.

'బహుమతి యిస్తానంటిరే...ఏదీ !!!' మాటలు రత్నాల మూటల్లా జారవిడిచింది.

'కళ్యాణీ! నీలోయింత సమ్మోహనశక్తీ, తెలివితేటలూ వున్నాయని నేటికిగాని తెల్సుకో లేకపోయాను.' అని అన్నాడు.

'మాటల్లోపెట్టి బహుమతి ఎగ్గొట్టాలనిగాబోలు' అంది.

'ఓస్...ఇంతేనా! నీకెప్పుడో నాహృదయం యిచ్చేసాను. ఇప్పుడు నన్ను నేనే అర్పణ చేసుకుంటున్నాను, నీయిష్టం వచ్చినట్టు ఏలుకో' స్వర్గ సౌఖ్యాల్లో తేలించాడు.

